
ఆంధ్రజ్యోతి
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 28 ఫిబ్రవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | :18004251442 |
| యాదాద్రి | :1800 425 7106 |
| సూర్యాపేట | :1800 425 1972 |

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.157 | 228 | 259 |
| సూర్యాపేట | రూ.160 | 230 | 260 |
| నల్లగొండ | రూ.160 | 230 | 250 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 24.2

# అంతా సర్వేమయం



- లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు
- అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానం కీలక భేటీలు
- తాజా రాజకీయ పరిస్థితులపై రాపిడ్ సర్వే

**పార్లమెంట్ ఎన్నికల సమయం సమీపిస్తోంది. మార్చిలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంటుందన్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. పైచేయి సాధించేందుకు అన్నిపార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రధాన పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థుల ఎంపికపై కీలక భేటీలు నిర్వహిస్తున్నాయి. రేపోమాపో అభ్యర్థులను ఖరారు చేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే ఏ పార్టీ అభ్యర్థి గెలిచే అవకాశం ఉందని?, ఇటీవల రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాలపై?, జాతీయ, ప్రాంతీయ పార్టీల్లో ఎవరికి ఓటు వేస్తే మేలని? తాజా అంశాలను పరిగణలోకి తీసుకుని జోరుగా సర్వేలు చేపడుతున్నారు.**

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల్లో ఇప్పటికే ఎంపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్న నేతలు సర్వే రిపోర్టులతో అధిష్ఠానాలను కలుస్తున్నారు. పార్టీ తరఫున తమకు టికెట్ ఇస్తే విజయం సాధించే అవకాశం ఉందని పార్టీ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు. ఒక్కో పార్లమెంట్ స్థానంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ తమకు పట్టు ఉందని నిరూపించే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎంపీ టికెట్‌కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేసిన కొంత మంది మాత్రం అనూహ్యంగా పోటీనుంచి మర్యాదపూర్వకంగా నిష్క్రమించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా ఓటమితో పాటు అధిష్ఠానం వద్ద తమ పలుకుబడి కూడా పోతుందన్న భావనతో తాము ఎంపీగా పోటీలో లేమని అధిష్ఠానాలకు పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నారు. దీంతో పోటీలో ఇద్దరు ముగ్గురు అభ్యర్థులే అధికంగా కన్పిస్తున్నారు. మరోవైపు ప్రధాన పార్టీల అధిష్ఠానాలు కూడా తమ పార్టీలోని ముఖ్యమైన అభ్యర్థులపై సర్వేలు నిర్వహిస్తున్నాయి. ఈ సర్వేలు ఎవరికి అనుకూలంగా ఉంటే వారిని ప్రకటించేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. ఎంపీ టికెట్ ఆశిస్తున్న నేతలు మాత్రం అంతా సర్వేలమయమని, అధిష్ఠానం నుంచి ఎవరికి పిలుపు వస్తుందోనని ఎదురుచూస్తున్నారు. ఆశావహులంతా ఎవరికి వారే టికెట్‌పై ధీమాతో ఉన్నారు.

### అధిష్ఠానం ఆశీస్సులు ఎవరికో..


లోక్‌సభ ఎన్నికలు సమయం దగ్గరపడుతున్నకొద్దీ అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రావడంలేదు. అన్ని పార్టీల్లోనూ నేతల మధ్య తీవ్రంగా పోటీ ఉండటంతో ఎవరికి టికెట్ ఇస్తే బాగుంటుందన్న అంశంపైనే ప్రధాన చర్చ జరుగుతోంది. ప్రధాన పార్టీలన్నీ కూడా ముందస్తుగానే ఎంపీ అభ్యర్థులను ప్రకటించాలని నిర్ణయించాయి. ఈమేరకు ఆయా ముఖ్యమైన మార్గాల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, అభ్యర్థులపై సమగ్ర సర్వేలు నిర్వహించాయి. అయితే సీనియర్ నేతలు టికెట్ తమకంటే తమకేనని పట్టుబడుతుండటంతో అధిష్ఠానాలు అభ్యర్థుల ప్రకటనపై ఆలోచనలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ ప్రధాన పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తుందని ప్రచారం సాగింది. అభ్యర్థులను ప్రకటించకపోవంతో ఇంకా చర్చల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది.

### ఒక్కో పార్టీలో ఒక్కో తీరు

భువనగిరి పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ నుంచి తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నల్లగొండ స్థానం నుంచి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తేర చిన్నపరెడ్డి, కినారా గ్రాండ్ హోటళ్ల యజమాని నరేందర్‌రెడ్డితోపాటు పలువురు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే గుత్తా సుఖేందర్‌రెడ్డి తన రాజకీయ వారసుడిగా అమిత్‌రెడ్డిని ఆరంగేట్రం చేయించాలని కృషి చేస్తున్నారు. గుత్తా అమిత్‌రెడ్డికి నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల్లో ఏదైనా స్థానంనుంచి అవకాశం కల్పించాలని ఆయన తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల వరకు నల్లగొండపై ఆశలు పెంచుకున్న అమిత్‌రెడ్డి, ప్రస్తుతం భువనగిరిపై దృష్టి కేంద్రీకరించారు. ఈ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా వాల్‌పెయింటింగ్‌లు వేస్తున్నారు. అమిత్‌రెడ్డికి అధిష్ఠానం ఏ స్థానం నుంచి అవకాశం కల్పిస్తుందో వేచిచూడాల్సిందే. మరోవైపు కాంగ్రెస్‌లో నల్లగొండ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు కందూరి రఘువీర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోంది. పటేల్ రమేష్‌రెడ్డి సూర్యాపేట ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేయగా చివరి నిమిషంలో చేజారింది. అయితే అధిష్ఠానం ఆయనకు పార్టీ సముచిత స్థానం ఇస్తుందని హామీ ఇచ్చింది. మరోవైపు మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డిని రాజకీయ ఆరంగేట్రం చేయించాలని తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించారు. అధిష్ఠానం ఎవరివైపు మొగ్గుచూపుతుందో వేచిచూడాల్సిందే. బీజేపీలో ఎంపీ టికెట్ల ఎంపిక విషయంలో తీవ్రంగా పోటీ నెలకొంది. నల్లగొండ నుంచి కిసాన్‌మోర్చా నేత గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, గత ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసిన జితేందర్‌కుమార్‌లు టికెట్‌కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. భువనగిరి నియోజకవర్గం నుంచి గతంలో పోటీచేసిన పీవీ శ్యాంసుందర్‌రావుతో పాటు మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పార్టీ సీనియర్ నేతలు వెదిరే శ్రీరాం, గంగిడి మనోహర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్ఠానాలు మాత్రం అవసరమైతే మరోసారి అభ్యర్థుల వారీగా రాపిడ్ సర్వేను నిర్వహించి, సర్వేల్లో వచ్చిన ఫలితాల ఆధారంగానే అభ్యర్థులను ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నాయి.

### ఖర్చుకు వెనుకాడుతున్న నేతలు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇష్టం ఉన్నా ఖర్చుకు భయపడి కొందరు సీనియర్ నేతలు వెనుకడుగు వేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పలుకుబడి ఉండి కూడా, డబ్బుల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లోనే చాలావరకు డబ్బులు ఖర్చు చేశాం, మరోసారి ఏడు నియోజకవర్గాల్లో నేతలను సమన్వయం చేసుకోవడం కష్టతరమని భావిస్తున్నారు. పార్టీ అధిష్ఠానాలు ఎన్నికల్లో కొంతైనా ఖర్చు భరించి, మిగతావి మీరు చూసుకోండని సూచిస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మరికొంతమంది నేతలు ఖర్చు ఎంతైనా పర్వాలేదు, రాజకీయ ఆరంగేట్రం ముఖ్యమని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానాలు ఎవరివైపు మొగ్గుచూపుతాయో వేచి చూడాల్సిందే.



# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో మళ్లీ కదలిక

- మార్చి 31లోగా పరిశీలనకు ప్రభుత్వం ఆదేశం
- ఉమ్మడి జిల్లాలో 2.54 లక్షలకు పైగా దరఖాస్తులు
- మూడున్నర ఏళ్లుగా పెండింగ్
- సర్కారుకు భారీగా సమకూరనున్న ఆదాయం

**నల్లగొండ/నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 27:** మూడున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులలో మళ్లీ కదలిక వచ్చింది. మరోసారి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. మార్చి 31లోగా పరిశీలన పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో అధికార యంత్రాంగం ఆ వైపుగా కసరత్తు చేయనుంది. నల్లగొండ, యాదాద్రిభువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో మొత్తం 19 మునిసిపాలిటీలు ఉండగా నందికొండ మినహా, మిగతా 18 మునిసిపాలిటీల్లో 2020 నవంబరు 10 నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుతో పాటు స్థలం యజమాని మీసేవా కేంద్రాల ద్వారా ఒక్కో ప్లాట్‌కు రూ.1000 చొప్పున రుసుము చెల్లించారు. మొత్తం 2.54లక్షల దరఖాస్తులు వచ్చాయి. వివిధ కారణాలతో మూడున్నరేళ్లుగా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. తాజాగా నూతన ప్రభుత్వం మునిసిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలన్న ఆదేశాలతో చలనం మొదలైంది.

### వివిధ దశల్లో దరఖాస్తుల స్వీకరణ

ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి వివిధ దశల్లో ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. 2015లో లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ప్రతి దరఖాస్తుతో పాటు రూ.10వేలు చొప్పున ఫీజులు వసూలు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 వేల దరఖాస్తులు వచ్చాయి. రెండేళ్ల పాటు వాటిని పరిశీలించి క్రమబద్ధీకరించారు. 2019లో మరోసారి ఫీజు చెల్లించిన వారి ప్లాట్లను పరిశీలించి క్రమబద్ధీకరించారు. వాటికి సంబంధించి ఇంకా 3వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫీజులు చెల్లించిన వారు ముందుకు రాకపోవడంతో దరఖాస్తులను పక్కనపెట్టారు. ఎల్ఆర్ఎస్‌పై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఆ కేసు ఇంకా నడుస్తోంది. తాజాగా రూ.1000 చెల్లించిన దరఖాస్తుదారులకు ప్రాధాన్యం కల్పించి ఆ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. అప్పటి ప్రభుత్వం ఒకసారి రూ.1000 మరోసారి రూ.10వేలు చొప్పున ఫీజులను వసూలు చేస్తూ చిత్రవిచిత్రంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను చేపట్టడం గమనార్హం. అనధికారిక లేఅవుట్లలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ చేస్తున్న నేపథ్యంలో కొన్ని వివాదాస్పద ప్లాట్లకు దరఖాస్తులు చేస్తుండడంతో వాటిని పెండింగ్‌లో ఉంచాల్సిన పరిస్థితి కూడా నెలకొంది.

### భారీగా ఆదాయం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి. అయితే దరఖాస్తుదారులు ముందుకు వస్తే క్రమబద్ధీకరణ జరిగి దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోనున్నాయి. అయితే అదేస్థాయిలో ప్రజలపై ఆర్థికభారం పడనుంది. అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేస్తున్న సమయంలో ప్లాట్ మార్కెట్ విలువతో 14శాతం రుసుమును వసూలు చేస్తారు. ఇది తమకు పెనుభారంగా మారుతుందని దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు. ఉదాహరణకు ఓ కుటుంబానికి 10 ప్లాట్లు ఉంటే అందులో ఒకటి విక్రయించిన సొమ్ముతో మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ వసూలు చేస్తున్న రుసుము ప్లాటు కొనుగోలు కంటే అనేక రెట్లు అధికమవుతుందని పేర్కొంటున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెద్దగా రానట్లు సమాచారం. ప్రభుత్వం కూడా పట్టణ ప్రాంతాల్లో వచ్చే ఆదాయమార్గాలపైనే దృష్టి సారించింది.

# పరీక్షల పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురిచేయొద్దు




జడ్పీ ఆరో స్థాయీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్‌పర్సన్ బాణాల కవిత

**సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 27 :** పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని పది, ఇంటర్ విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావద్దని జడ్పీ ఆరో స్థాయీ సంఘం చైర్‌పర్సన్ బాణాల కవిత గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, సీఆర్‌పీలకు సూచించారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన ఆరో స్థాయీ(సాంఘిక సంక్షేమం) సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇమాంపేట గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యలు చేసుకోవడం తనను మానసికంగా కలిచివేసిందన్నారు. అలాంటి సంఘటనలు మరల జిల్లాలో పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలల్లో ప్రిన్సిపాల్స్ విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలన్నారు. ప్రతీ గురుకుల పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. పదో, ఇంటర్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు రాత్రి సమయంలో టీ, బిస్కెట్లు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. దీంతో పాటుగా గురుకుల పాఠశాల విద్యార్థులకు వేకువజామున స్నానాల కోసం వేడి నీళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ చేరాలంటే అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే ప్రజలు అభివృద్ధి చెందుతారని ఆమె అన్నారు. మధ్యాహ్నం జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన ఐదో స్థాయీ(మహిళా, శిశుసంక్షేమం) సంఘం సమావేశానికి చైర్‌పర్సన్ చింతారెడ్డి చంద్రకళ అధ్యక్షత వహించి, మాట్లాడారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలపై సూపర్‌వైజర్లు, సీడీపీవోలు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలన్నారు. చిన్నారుల ఆరోగ్య, శారీరక ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వీవీ అప్పారావు, డిప్యూటీ సీఈవో శిరీష, జడ్పీటీసీలు జీడీ భిక్షం, బొలిశెట్టి శిరీష, మాలోతు బుజ్జి, జడ్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### అధికారుల గైర్హాజరుపై చైర్‌పర్సన్ ఆగ్రహం

జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలకు తప్పనిసరిగా జిల్లా అధికారులు హాజరుకావాలని పలుమార్లు హెచ్చరించినా వారిలో ఏమాత్రం మార్పు రాలేదని ఆరో స్థాయీ సంఘం చైర్‌పర్సన్ బాణాల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించిన స్టాండింగ్ సమావేశానికి జిల్లా అధికారుల స్థానంలో వారి కార్యాలయాల్లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు హాజరు కావడంతో వారిపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ప్రతీ సమావేశాలలో జిల్లాస్థాయి అధికారులే స్థాయీ సంఘం సమావేశాలకు హాజరుకావాలని చెప్పినా పెడచెవిన పెడుతున్నారని అన్నారు. సమావేశానికి హాజరుకానీ జిల్లాస్థాయి అధికారులకు నోటీసులు ఇచ్చి, వారి నుంచి వివరణ కోరాలని జడ్పీ సీఈవో వీవీ అప్పారావుకు సూచించారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు
- నిమిషం ఆలస్యం నిబంధన అమలు



సూర్యాపేటలోని పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్లను వేస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న డీఐఈవో కృష్ణయ్య

**సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 27 :** నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా వ్యాప్తంగా 32 పరీక్షా కేంద్రాల్లో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు 16,602 పరీక్షలకు హాజరుకానున్నారు. నేటి నుంచి మార్చి 16 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే పరీక్ష రాసే కేంద్రాలను, హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు.

### నిమిషం ఆలస్య నిబంధన అమలు

పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను 8 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. జిల్లాలో 77 కళాశాలలు ఉండగా 16,602 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 7, సాంఘిక సంక్షేమ కళాశాలలు 8, బీసీ సంక్షేమ శాఖ కళాశాలలు 8, కేజీబీవీ కళాశాలలు 5, మైనార్టీ కళాశాలలు 4, గిరిజన సంక్షేమ కళాశాలలు 3, తెలంగాణ రెసిడెన్షియల్ కళాశాల 1, ఆదర్శ కళాశాలలు 9 ఉన్నాయి. వీటితో పాటు 32 ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సర విద్యార్థులు 8,285 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 8,317 మంది ఉన్నారు.

### అన్నిఏర్పాట్లు పూర్తి

జిల్లాలో ఇంటర్ విద్యార్థులు 32 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. పరీక్షలకు సంబంధించి అధికారులను నియమించారు. ప్రతీ కేంద్రానికి ఒక సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు ఇద్దరు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఇద్దరు, సిట్టింగ్ స్క్వాడ్‌లు ముగ్గురిని నియమించారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల్లో మరుగుదొడ్లు, డ్యూయల్ డెస్క్ బెంచీలు, విద్యుత్ సమస్య తలెత్తకుండా అన్నిఏర్పాట్లుచేశారు. అదేవిధంగా తాగు నీటి సౌకర్యం ఉండేలా సంబంధిత కేంద్రం నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.

### పకడ్బందీగా పరీక్షల నిర్వహణ: కృష్ణయ్య, డీఐఈవో

జిల్లాలో పకడ్బందీగా ఇంటర్ పరీక్షలను నిర్వహించేలా అన్ని ఏర్పాట్లుచేశాం. ఉదయం ఏడు గంటల నుంచి జిరాక్స్ సెంటర్లను మూసివేయాలి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. సెంటర్లలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా కళాశాలల యజమాన్యాలకు ఆదేశాలు జారీచేశాం. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలి.

### విద్యార్థుల సేవలో ఆర్టీసీ




ఇంటర్ విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సౌకర్యం కల్పించింది. ఇప్పటికే మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా, పరీక్షలకు హాజరవుతున్న బాలురకు కూడా ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తోంది. హాల్‌టికెట్ చూపించి పరీక్షా కేంద్రం ఉన్న మండలానికి, పట్టణానికి ఉచితంగా ప్రయాణించొచ్చు. అదేవిధంగా పరీక్షలకు సకాలంలో హాజరయ్యేందుకు సర్వీసులను నడపనుంది. 7

# ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

**సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 27:** పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్ల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులను ప్రతి ఒక్కరూ సమర్థంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డీఎం బాపూజీ, ఎన్నికల పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, మాస్టర్ ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సాగులో సాంకేతికతను జోడించాలి

సాంకేతికతను జోడించి తక్కువ ఖర్చుతో రైతులు సాగు చేయాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. అర్వపల్లి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జిల్లాలో మొదటిసారి అర్వపల్లి మండలం కొమ్మాలకు చెందిన రైతు కుంటిగొర్ల నాగరాజు కొనుగోలు చేసిన అగ్రి డ్రోన్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం బాపూజీ, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ జ్యోతి, నర్సింహారావు, బ్రాంచ్ మేనేజర్ అనిల్, రైతు నాగరాజు ఉన్నారు.

# 'గృహజ్యోతి'కి 1.47 లక్షల మంది అర్హులు

**భానుపురి, ఫిబ్రవరి 27 :** జిల్లాలో 1,47,371 లక్షల మంది గృహజ్యోతి పథకానికి అర్హులు ఉన్నారని, మార్చి 1 నుంచి 200 యూనిట్ల లోపు బిల్లులు వచ్చిన వారికి గృహజ్యోతి పథకం అమలవుతోందని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పాల్‌రాజ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇంకా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే ఎంపీడీవో, మునిసిపాలిటీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ధ్రువీకరణ కార్డును సూర్యాపేట విద్యుత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. జిల్లాలో 2,76,629 గృహ విద్యుత్ సర్వీసులు ఉన్నాయన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, మొబలై నెంబరు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని అర్హులైన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట డీఈలు శ్రీనివాస్, దాలినాయుడు, సత్యనారాయణ, ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్‌భాస్కర్ తదితరులు ఉన్నారు.

# క్యాంపునకు తరలిన తిరుమలగిరి కౌన్సిలర్లు


**తిరుమలగిరి, ఫిబ్రవరి 27:** తిరుమలగిరి మునిసిపల్ వైస్‌చైర్మన్ పోతరాజు రజని, వైస్‌చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డిలపై అవిశ్వాస నోటీసులు అందజేసిన కౌన్సిలర్లు క్యాంప్ బాటపట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ వెంకటరావుకు అవిశ్వాస నోటీసును అందజేసి, ప్రత్యే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మునిసిపాలిటీలో మొత్తం 15 వార్డులకు 10 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా సంతకాలు చేశారు. వీరిలో కాంగ్రెస్ నుంచి ఆరుగురు, బీజేపీ నుంచి ఒక్కరు, బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఐదుగురు మహిళా కౌన్సిలర్లను క్యాంప్‌నకు తరలించారు. మరో ఐదుగురు అవిశ్వాస తీర్మానం తేదీ నిర్ణయం తెలుసుకుని, నేడో, రేపో వారు కూడా క్యాంప్‌నకు తరలనున్నట్లు సమాచారం. క్యాంప్‌నకు వెళ్లిన వారిలో 8వ వార్డు కౌన్సిలర్ శాగంటి అనసూయ, 15వ వార్డు కౌన్సిలర్ గిలకత్తుల ప్రియలత, 14వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజ్య లక్ష్మి, 9వ వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రేణుక, 7వ వార్డు కౌన్సిలర్ కేశిడి సరళ ఉన్నారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో వసూళ్లు

- ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు
- నకిలీ ఉద్యోగాల పత్రాల అందజేత
- పోలీసుల అదుపులో నిందితుడు

7

# పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

**సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 27 :** పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రైనీ ఐపీఎస్ రాజేష్‌మీనా, అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావుతో కలిసి నిర్వహించిన పోలీసుల నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. గుర్తుతెలియని మృతదేహాలకు సంబంధించిన కేసులను త్వరగా ఛేదించాలన్నారు. గంజాయితో అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

### ప్రశంసాపత్రాలు అందజేత

జిల్లాలో నమోదైన కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడుతున్నాయని దీనికి ప్రధాన కారణం పోలీసుల నాణ్యమైన దర్యాప్తు అని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. పోలీసులు త్వరగా కేసుల విచారణను పూర్తి చేసి నేర అభియోగ పత్రాలను కోర్టులకు అందిస్తున్నట్లు వివరించారు. దీంతో ఇటీవల నేరేడుచర్ల, మోతె పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతంలో నమోదైన పోక్సో చట్టం కేసులకు సంబంధించి ఇద్దరు నేరస్తులను జీవిత ఖైదు శిక్షలు విధిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షలు పడేలా కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్, భరోసా సెంటర్ సిబ్బందికి డీజీపీ కార్యాలయం నుంచి అందించిన ప్రశంసాపత్రాలను భరోసా సెంటర్ ఎస్ఐ మౌనిక, ఏఎస్ఐ సైదాబీ, నేరేడుచర్ల స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ లింగయ్య, మోతె కానిస్టేబుల్ రవీందర్‌లకు అందజేశారు.

### సిల్వర్ మెడల్ గెలిచిన రోలెక్స్ డాగ్

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ నెల 16న నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో జిల్లా పోలీస్ విభాగానికి చెందిన రోలెక్స్ డాగ్ సిల్వర్ మెడల్ సాధించింది. నార్కోటిక్ పదార్థాల గుర్తింపు విభాగంలో ఈ మెడల్ సాధించింది. అందుకు గాను ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే సిల్వర్ మెడల్‌ను డాగ్ ఇన్‌చార్జి సతీష్‌కు అందించి అభినందించారు. సమావేశంలో ఆర్మ్‌డ్ విభాగం అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, డీఎస్పీలు రవి, మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, సీఐలు శివకుమార్, రాజేష్, రామలింగారెడ్డి, వీరరాఘవులు, రాజశేఖర్, రజితారెడ్డి, సురేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, రాము, శ్రీనివాస్, రఘువీర్‌రెడ్డి, ఆర్ఐ నర్సింహ, ఆర్ఎస్ఐలు సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి పనిచేయాలి

● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

**నల్లగొండ, ఫిబ్రవరి 27:** పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అభ్యర్థి ఎవరనేది కాకుండా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటే పార్టీ ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల్లో ఒక వేవ్ వచ్చిందని, దీంతోనే ఒక్కో అభ్యర్థి 50వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారని గుర్తుచేశారు. నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో పార్టీ ఓడిపోయిందని, గత ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేసుకోవాల్సిన అవసరం పార్టీకి ఉందని, పొరపాట్లను సరిదిద్దుకోవాలన్నారు. నల్లగొండ, భువనగిరి అభ్యర్థుల ఎంపిక విషయం కంటే ముందే అందరూ చర్చించుకుని పార్టీ గెలుపు కోసం సహకారం అందించాలన్నారు. వచ్చే ఫలితం గెలిచినా, ఓడినా గౌరవ ప్రదంగా ఉండాలని ఆ విధంగా బేరీజు వేసుకుని సహకరించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జైశ్రీరామ్ నినాదంతో 400 సీట్లు గెలుచుకోవడానికి ముందుకు వచ్చిందన్నారు. పది సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా కరువు ఏర్పడినందున కర్ణాటకలో ఆ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించి నారాయణపూర్, ఆలమట్టి నుంచి 10టీఎంసీల నుంచి 15 టీఎంసీల వరకు నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేలా చూడాలని కోరారు. నల్లగొండ జిల్లాలో మార్చి నాటికి తాగునీటి ఎద్దడి ఏర్పడడంతో పాటు పొట్ట దశలో ఉన్న వరిపంటలు ఎండిపోయే పరిస్థితిలో ఉన్నందున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించాలన్నారు. ఒక తడికైనా నీటిని అందివ్వాలని కోరారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల్లో నీరు లేక ఆయకట్టు కింద క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. రైతులు బోర్ల కింద, బావుల కింద వ్యవసాయం చేస్తున్నారని, భూగర్భజలాలు అడుగంటడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ఎన్నికల హడావుడిలో ఉన్నందున ప్రజలను పట్టించుకోకుండా ఉండవద్దన్నారు. కోట్లాది రూపాయల వరి దిగుబడులను కాపాడాలంటే నీటి విడుదల అత్యవసరమని ఆయన అన్నారు.

## కారు ఢీకొని ఒకరి మృతి

**జనగామ టౌన్, ఫిబ్రవరి 27:** జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్తున్న బైక్‌ను కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందారు. జనగామ పట్టణ ఎస్ఐ సృజన్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేట గ్రామానికి చెందిన ఉప్పు నర్సింగరావు(40) జనగామ మండలం పెంబర్తి గ్రామ శివారులో మంగళవారం పొలం వద్దకు వెళ్లాడు. పనులు ముగించుకుని రాత్రి 8 గంటలకు ద్విచక్రవాహనంపై శారాజీపేటలోని ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో పెంబర్తి శివారులో పొన్నాల లక్ష్మయ్య పౌల్ట్రీఫామ్ వద్ద శారాజీపేటకు వెళ్లే రోడ్డులోకి వెళ్లేందుకు రాంగ్ రూట్‌లో కుడి వైపు నుంచి వెళ్తున్నాడు. అదే సమయంలో వరంగల్ కిట్స్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నారు. రాంగ్ రూట్‌లో ఉన్న నర్సింగరావును వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

## ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

### మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

### కాంగ్రెస్ వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

**హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి**

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్ళకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.

# తల్లిని అడ్డు పెట్టుకొని రాజకీయాలు

**పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం**

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కార హీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.

### సంజయ్ క్షమాపణ చెప్పాలి

**కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్**

**పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం**

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

## ఆర్టీసీ డిపోలో బస్టాండుల్లో హెల్ప్ డెస్క్‌లు

**నల్లగొండ, ఫిబ్రవరి 27:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఏడు డిపోలకు అనుబంధంగా ఉన్న ప్రధాన బస్టాండులలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేశారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు బస్సుల వివరాలను ఎప్పటికప్పుడు అందించడం కోసం ఇద్దరు ఉద్యోగులను కూడా బాధ్యతలు అప్పగిస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. పరీక్షల సమయం కావడంతో ప్రస్తుతానికి ఇంటర్ విద్యార్థుల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేయగా కొద్ది రోజుల్లో పదో తరగతి విద్యార్థుల సౌకర్యార్థం కూడా హెల్ప్‌డెస్క్‌లు నిరంతరం ఉండనున్నాయి. మిర్యాలగూడ బస్టాండ్‌కు సంబంధించి హెల్ప్‌డెస్క్ నెంబర్ 08689241111, నల్లగొండ బస్టాండులో 08682293622, సూర్యాపేటలో 7382943819ను ఏర్పాటు చేశారు. కోదాడలో 9959226302, యాదగిరిగుట్టలో 7382835807, నార్కెట్‌పల్లిలో 8309158944, దేవరకొండలో 9490510752 నెంబర్‌ను హెల్ప్‌డెస్క్‌లకు అందుబాటులో ఉంచారు.

## వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని హత్య

**మేళ్లచెర్వు, ఫిబ్రవరి 27:** వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను ప్రియుడితో కలిసి భార్య హత్య చేసింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో ఈ నెల 25వ తేదీన జరిగిన హత్య కేసును పోలీసులు చేధించారు. మేళ్లచెర్వు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మండలకేంద్రానికి చెందిన దివ్యాంగుడు వీర గోపయ్య(32) హత్యకు గురయ్యాడు. గోపయ్య భార్య వీరకుమారికి మండలకేంద్రానికి చెందిన సైదా హుస్సేన్‌తో వివాహేతర సంబంధం ఉంది. భర్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని, ఈ నెల 25వ తేదీ(ఆదివారం అర్ధరాత్రి) ప్రియుడితో కలిసి వీరకుమారి గోపయ్య ముఖానికి దిడ్డు వేసి, గట్టిగా అదిమి పట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. అనంతరం సహజ మరణంగా చిత్రీకరించింది. బంధువులు, ఒంటి మీద గాయాలు చూసి, అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసు విచారణలో నిందితులు నేరం ఒప్పుకున్నారని డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును చేధించిన కోదాడరూరల్ సీఐ రజితారెడ్డి, మేళ్లచెర్వు ఎస్ఐ పరమేష్, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, పోలీసులు, గోపయ్య, శ్రీనివాస్‌లను ఎస్పీ అభినందించారని ఆయన తెలిపారు.

## మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

**ఆలేరు రూరల్, ఫిబ్రవరి 27:** మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించుకెళ్లిన సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో మంగళవారం జరిగింది. పట్టణంలోని పోచమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న ఎగ్గిడి మల్లయ్య భార్య ఎగ్గిడి సిద్దమ్మ తెల్లవారుజాము ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో గుర్తుతెలియని అగంతకుడు వెనుక నుంచి వచ్చి బాధితురాలి నోరు మూసి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును తీసుకొని పారిపోయాడు. ఆ మహిళ ఒకేసారి అరవడంతో చుట్టుపక్కల వారు చేరారు. భర్త మల్లన్న బయటకు వచ్చి దొంగను కొద్దిసేపు వెంబడించినా పట్టుకోలేకపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భార్య, వదినలపై బ్లేడుతో దాడి

**గరిడేపల్లి, ఫిబ్రవరి 27:** కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య, వదినను బ్లేడుతో గాయపరిచిన నిందితుడిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో మండలంలోని కాల్వలపల్లి ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వపల్లి గ్రామానికి చెందిన గుండెబోయిన నాగయ్య రెండో కుమార్తె నాగలక్ష్మికి మేళ్లచెర్వు మండలం రేవూరు గ్రామానికి చెందిన యరకలపూడి నాగార్జున్‌కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఆరేళ్ల కుమారుడు భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా మూడేళ్లుగా నాగలక్ష్మి భర్తకు దూరంగా కాల్వపల్లిలో ఉంటోంది. నాగార్జున్ తన కుమారుడిని చూడడానికి అప్పడప్పుడు కాల్వపల్లి వస్తుండేవాడు. మంగళవారం మధ్యాహ్నం భార్య, కుమారుడిని చూసి వెళ్లడానికి వచ్చిన క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. నాగలక్ష్మీ హుజూర్‌నగర్‌లోని ఓ ఫైనాన్స్‌లో పనిచేస్తుండగా, అక్కడికి వెళ్లాడు. అక్కడే ఆమెపై బ్లేడుతో దాడిచేసేందుకు ప్రయత్నించి సీసీ కెమెరాలు ఉండడాన్ని గమనించి ఆమె ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. సహనం కోల్పోయి భార్యను చంపుతానని నాగార్జున బ్లేడ్‌తో గొంతు కోయడానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న నాగలక్ష్మీ అక్క స్వరూప అడ్డురాగా ఆమె గొంతు కూడా కోశాడు. ఇది గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో స్వరూప భర్త తన భార్య స్వరూపను, నాగలక్ష్మీలను బైక్‌పై హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాడు. నిందితుడు నాగార్జున్‌ను పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు.

# పరీక్షల జంబ్లింగ్‌లో గ్యాంబ్లింగ్ ?

● ఇంటర్ పరీక్షా కేంద్రాల సెంటర్లలో గందరగోళం ● చెవిటి, మూగ విద్యార్థుల సెంటర్లను ఉపయోగించుకునే ఎత్తుగడ

**నల్లగొండ, ఫిబ్రవరి 27:** ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మిర్యాలగూడలో ఇంటర్మీడియట్ పరీక్షల సెంటర్లను కొందరు దొడ్డిదారిన దుర్వినియోగం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు డఫ్ అండ్ డమ్(చెవిటి, మూగ) విద్యార్థుల కోసం కొన్ని సౌకర్యాలు కల్పించారు. ముఖ్యంగా పరీక్షలు సాధారణ విద్యార్థులకు మూడు గంటల పాటు సమయం ఇస్తారు. డఫ్ అండ్ డమ్ విద్యార్థులకు మాత్రం మరో గంట అదనంగా అంటే నాలుగు గంటల పాటు పరీక్షలు రాసుకునే వీలుంటుంది. ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ బోర్డుకు సంబంధించి ప్రత్యేకంగా జీవో ఉంది. దీనికి తోడు సాధారణ విద్యార్థులు ప్రతి పరీక్షలో 35 మార్కులకు పాస్ అయితే డఫ్ అండ్ డమ్ విద్యార్థులు మాత్రం 25 మార్కులతో ఉత్తీర్ణత అయ్యే అవకాశం ఉంటుంది. మిర్యాలగూడలో చెవిటి, మూగ విద్యార్థులకు సంబంధించి ప్రత్యేకంగా కళాశాల ఉంది. ఈ ఇంటర్ పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా అంతా కలిపి సుమారు 150మంది వరకు డఫ్ అండ్ డమ్ విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. ఇక డఫ్ అండ్ డమ్ విద్యార్థులకు ప్రత్యేకంగా సెంటర్లు ఉంటాయి. దీనిని కొంతమంది ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు దుర్వినియోగం చేస్తున్నట్లు విమర్శలు వచ్చాయి. డఫ్ అండ్ డమ్ విద్యార్థుల సెంటర్లల్లో ఒకేషనల్ విద్యార్థులతో పాటు కొన్ని ఆర్ట్స్ గ్రూపునకు సంబంధించిన విద్యార్థులను డఫ్ అండ్ డమ్ విద్యార్థుల్లో సెంటర్లలో జంబ్లింగ్ పేరిట సెంటర్లను ఉపయోగించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మాస్ కాపీయింగ్ చేయడంతో పాటు అదనంగా మరో గంటను డఫ్ అండ్ డమ్ విద్యార్థులతో కలిసి పరీక్షలు రాసి లబ్ది పొందేందుకు ప్రయత్నాలు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ విషయం రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో రాత్రికిరాత్రే దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నట్లు చర్చ సాగుతుంది. మిర్యాలగూడ సెంటర్‌లల్లో జరిగిన దుర్వినియోగంపై డీఐఈవో దస్రునాయక్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరింది. దీనిపై ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడలో డఫ్ అండ్ సెంటర్‌లల్లో పొరపాట్లు లేవని, కావాలని సెంటర్లను ఏర్పాటు చేసు కుంటే తొలగిస్తామని తెలిపారు. చెవిటి, మూగ విద్యార్థులకు సంబంధించిన కేంద్రాల్లో ఇతర విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలు లేదని దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

## విద్యార్థుల సేవలో ఆర్టీసీ

**మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 27:** మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తున్న ఆర్టీసీ విద్యార్థులకూ సేవలందించేందుకు ఉపక్రమించింది. పరీక్షల సందర్భంగా ప్రత్యేక మినహాయింపులు ప్రకటించింది. ఇంటర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులను సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంది. డ్రైవర్లు, కండక్టర్లకు ఆదేశాలిచ్చింది.

● పరీక్షల సమయానుకూలంగా ఆయా రూట్లలో బస్సులు నడిపించాలని ఉద్యోగులను ఆదేశించింది.

● చెల్లుబాటయ్యే బస్‌పాస్ కలిగి ఉన్న విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి రెగ్యులర్ రూట్లు కాకుండా ఇతర రూట్లలోనూ ప్రయాణించే వెసులుబాటు కల్పించింది.

● పల్లెవెలుగు బస్‌పాస్‌లు కలిగి ఉన్న విద్యార్థులకు పరీక్షా కేంద్రాల రూట్లలో వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించే సదుపాయం కల్పించింది. అయితే అందుకు కాంబినేషన్ టికెట్(అంటే.. ఎక్స్‌ప్రెస్ టికెట్ చార్జీలో పల్లె వెలుగు చార్జీ తగ్గిస్తారు) బస్ పాస్ ధర మినహాయించి తీసుకోవాలని సూచించింది.

● రూట్లలో స్టాప్ లేనప్పటికీ పరీక్షా కేంద్రాల సమీపంలో (ఆ బస్సులో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులుంటే) బస్సులు ఆపాలని నిర్ణయించింది.

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం సంస్థ ప్రత్యేక మినహాయింపులు కల్పించిందని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేర్చేలా బస్సుల సమయాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నామని తెలిపారు.

# మేము ఓటు బ్యాంకు కాదు.. సీట్లు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాపయ్యమాదిగ

**సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 27:** తాము ఓటు బ్యాంకు కాదని, అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పద్మశాలీ భవనంలో మంగళవారం జరిగిన మాదిగ, మాదిగ ఉప కులాల జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి టిమాదిగలకు కేటాయించడంతో పాటు జనరల్ స్థానాల్లో సైతం మాదిగలకు ఒక స్థానం కేటాయించేలా రాజకీయ పార్టీలు చొరవ చూపాలన్నారు. మాదిగలు రాజకీయంగా వెనకబడిపోయారని, అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను ఓటు బ్యాంక్‌గా చూపడం దారుణమన్నారు. గతంలో వేసిన లోకూర్ కమీషన్, రామచంద్రరాజు కమీషన్, ఉషా మెహర కమీషన్‌లు ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించాలని స్పష్టమైన నివేదిక ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వాలు మారినా అమలు కావడంలేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింత బాబుమాదిగ, వెంకటయ్య, మేడి రమణమాదిగ, కనుకు జానయ్యమాదిగ, పల్లేటి లక్ష్మణ్, దుబ్బ రమేష్, కందుకూరి వీరబాబు, గురుస్వామి, నెమ్మాది సంజీవ, మాదాసు నాగయ్య, చింత సైదులు, ఏర్పుల నాగరాజు, వినోద్, ప్రసాద్, రవికుమార్, శ్రీను, గురవయ్య, రాంబాబు, రాము, జీవరత్నం, చిలకబాబు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా నాగవల్లీ దళార్చనలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 27:** యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామికి మంగళవారం నిత్య విధి కైంకర్యాలు, క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ప్రధానాలయంలోని స్వయంభువలను సుప్రభాతంతో మేల్కొలిపిన ఆచార్యులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాలు నిర్వహించారు. కొండపైన విష్ణు పుష్కరిణి, ప్రధానాలయం, అనుబంధ పాతగుట్ట, శివాలయంల్లో కొలువైన ఆంజనేయస్వామిని అర్చకస్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.25,10,779 ఆదాయం సమకూరింది.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో వసూళ్లు

● ఒక్కొక్కరి వద్ద రూ.50వేల నుంచి రూ.2లక్షలు వసూలు ● నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు అందజేత ● డబ్బుల కోసం నిలదీస్తే ప్రామిసరీ నోట్లు రాసిచ్చిన వైనం ● బాధితుల ఆందోళన



ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కార్యాలయంలో విచారణ చేస్తున్న పోలీసులు

**సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 27:** నిరుద్యోగుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఔట్ సోర్సింగ్ పద్ధతిన కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేశాడు సూర్యాపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తి. డబ్బులు చెల్లించిన వారిలో కొంతమందికి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడంతో అసలు విషయం బయటపడింది. మోసపోయామని గ్రహించిన బాధితులు డబ్బులు ఇవ్వాలని సదరు వ్యక్తిని అడగగా నెలల తరబడి తిప్పుతుండడంతో చేసేది లేక మంగళవారం సంబంధిత ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని మెయిన్‌రోడ్డులోని ఓ భవనంలో సూర్యాపేటకు చెందిన గజ్జి శంకర్ మణికంఠ ఔట్ సోర్సింగ్ సర్వీస్ పేరుతో కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. కలెక్టరేట్‌లో శానిటేషన్ విభాగంతో పాటు అటెండర్, స్వీపర్ ఉద్యోగాలు ఇస్తానని కొందరిని నమ్మించాడు. ఒక్కో ఉద్యోగానికి రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు ముట్టజెప్పారు. ఈ విధంగా సుమారు రూ.30లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. డబ్బులు తీసుకుని నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో కొంతమంది నిలదీయగా అందులో కొందరికి నకిలీ నియామకపత్రాలు అందజేశాడు. వారు కలెక్టరేట్‌కు వెళ్లి అక్కడ విచారించగా అవి నకిలీ పత్రాలని అధికారులు తెలిపారు. వారు తిరిగి సంబంధిత ఏజెన్సీ నిర్వాహకుడిని ప్రశ్నించగా 'మీకు కలెక్టరేట్‌లో అధికారులతో సంబంధం లేదు. ప్రతిరోజూ కలెక్టరేట్‌కు ఉదయం వెళ్లి సాయంత్రం వరకు ఉండండి. మీకు నెలకు రూ.8వేల చొప్పున వేతనం వస్తుంది' అని నమ్మించాడు. ఆవిధంగా ముగ్గురికి మూడు నెలలుగా వేతనం చెల్లిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన మిగిలిన బాధితులు తమ పరిస్థితి ఏమిటని నిలదీశారు. చేసేది లేక వారికి కొంతమందికి వారు ఇచ్చిన డబ్బులు త్వరలో ఇస్తానని ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చాడు. నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోగా ఎలాంటి ఉద్యోగాలు కూడా ఇప్పించలేదు. దీంతో బాధితులు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు శంకర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# చెరువులు, కుంటలకు వేలం పాటలు

**జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మార్చి 3వరకు కొనసాగింపు**

**భానుపురి, ఫిబ్రవరి 27:** మత్స్య సహకార సంఘాల ఆధీనంలో లేని గ్రామ పంచాయతీ చెరువులు, కుంటలకు వేలం పాటలు సూర్యాపేటలోని మత్స్యశాఖ కార్యాలయంలో సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా మత్స్య శాఖ అధికారి రూపేందర్‌సింగ్, కోదాడ డీఎల్‌పీవో యాదగిరి, మత్స్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో పాల్గొనడానికి ఆరుగురు ముందుకు వచ్చారు. గాయంవారిగూడెం, ఏనుబాముల, గట్టికల్ గ్రామానికి చెందిన ఆరుగురు వేలంలో పాల్గొనడానికి రూ.5వేల చొప్పున డిపాజిట్ చేశారు. ప్రభుత్వ వేలం పాట నిబంధనల మేరకు వాటి విస్తీర్ణాల ప్రకారం ధరను నిర్ణయించి పాడారు. అయితే వేలం డిపాజిట్ చేసిన వారు మాత్రం తమకు తక్కువ సమయం ఉందని, డిపాజిట్ చేసిన డబ్బులను వెనక్కు తీసుకున్నారు. దీంతో రింగయ్యారా? అనే అనుమానం చాలా మందికి వచ్చింది. ఎవరూ వేలం పాడనందున ఈ అనుమానానికి బలం చేకూరింది.

మంగళవారం 25 చెరువులు, కుంటలకు వేలం నిర్వహించాల్సి ఉండగా మూడు గ్రామాల నుంచే వచ్చారు. మిగతా వారు రాలేదు. చెరువు, కుంట విస్తీర్ణం బట్టి అధికారులు వేలం పాటను మొదలు పెట్టారు. 0-5 హెక్టార్లు, 5-10 హెక్టార్లు, 10-15, 15-20, 20-25, 25-30 హెక్టార్లకు ఒక్కో ధరను నిర్ణయించి వేలం పాటను అధికారులు పాడారు. అయితే తక్కువ వేలం పాడకుండా ప్రభుత్వం వారి పాట రూ.20వేలు, రూ.30వేలు, రూ.40వేలు నిర్ణయించారు. పాడితే తమకు నష్టం వస్తోందని వేలం పాటలో డిపాజిట్ చేసిన ఆరుగురు తమ డబ్బులను వెనక్కు తీసుకుని వెళ్లిపోయారు. మిగతా చోట్ల పాట పాడడానికి నిర్ణయించిన సమయం లోపు ఒక్కరూ కూడా రానందున వేలం పాట నుంచి అధికారులు మధ్నాహ్నం వెళ్లిపోయారు.

ఈనెల 27 నుంచి మార్చి మూడో తేదీ వరకు వేలం పాటలు కొనసాగనున్నాయి. మొదటి రోజు(అనంతగిరి మండలంలోని అనంతగిరి గ్రామంలో నినర్సన్నకుంట, తుమ్మల్లకుంట, దొరకుంట, ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఏనుబాముల గ్రామంలోని కర్ణమ్మకుంట, వూరకుంట, మోదినికుంట, గట్టికల్ గ్రామంలోని చౌడమ్మచెరువు, ఊర చెరువు, ఊరకుంట, పీతిరికుంట, ఎర్రకుంట, పల్లవానికుంట, ఇస్తాలపురంలోని ఊరచెరువు, ఎర్రకుంట, మద్దికుంట, మిడతనపల్లి గ్రామంలోని గార్లకుంట, నందికుంట, చిలుకూరు మండలంలోని జేపీ గూడెం కుంట, చింతలపాలెం మండలంలోని తమ్మరాజుకుంట, నాగులచెరువు, చివ్వెంల మండలంలోని చందుపట్ల గ్రామంలో కొమటికుంట, కొత్తకుంట, చౌటకుంట, గాయంవారిగూడెంలోని ఊర చెరువు, నల్లకుంట, గుంపుల గ్రామంలోని చౌటకుంటలకు వేలం పాట పాడాల్సి ఉంది. అయితే పాటకు ఎవరూ రాలేదు.

28న చివ్వెంల మండలంలోని గుంపుల గ్రామంలోని మోదుగులకుంట, జాలుకుంట, తమ్మడికుంట, తిమ్మాపురంలోని బావచరాయికుంట, నూకలవాణికుంట, మాదరసానికుంట, తిర్మలగిరిలోని ఊరచెరువు, వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలోని నరేళ్లకుంట, గరిడేపల్లి మండలం కుతుబ్‌షాపురంలోని కొత్తచెరువు, కుమ్మరికుంట, పకీర్‌వాణికుంట, హుజూర్‌నగర్ మండలంలక్కవరంలోని ఉత్తమ్‌చెరువు, జాజిరెడ్డిగూడెం కుంచమర్తి గ్రామంలోని జక్కులకుంట.

29న జాజిరెడ్డిగూడెం మండలం వెల్పులచర్ల గ్రామంలోని జాలుబందం కుంట, ఊరచెరువు, కోదాడ మండలం కూచిపూడి గ్రామంలోని పెద్దన కుంట, మద్దిరాల మండలం మామిండ్లమడవ గ్రామపరిధిలోని బంజరు కుంట, జి.కొత్తపల్లి గ్రామంలోని పడమటికుంట, తూర్పుకుంట, మోతె మండలం అన్నారిగూడెంలోని నూనెవారికుంట, ఊరకుంట, నేరేడువాయి గ్రామంలోనిఎర్రకుంట, కూడలిలోని గుండ్లకుంట, ఊర చెరువు.



సూర్యాపేటలో నిర్వహించిన వేలం పాటలో ఉన్న అధికారులు

మార్చి 1న మునగాల మండలం కొక్కిరేణి గ్రామంలోని గుర్రపకుంట, యడ్లకుంట, ముకుందాపురంలోని మర్రికుంట, తీపాయికుంట, నూతనకల్ మండలం వెంకేపల్లి గ్రామంలోని గాల్లారాజులకుంట, మిధనికుంట, పార్వతికుంట, సంఘమజులకుంట, తకెళ్లకుంట, లింగంపల్లిలోని చిలకలకుంట, ఎర్రపహాడ్‌లోని ఊరకుంట, బిక్కుమళ్లలోని ఊరకుంట, పెండెవాలుకుంట, పెద్దనెమిలలోని చింతకుంట, మల్లన్నకుంట, మాల్లోజుకుంట, ముత్యాలమ్మకుంట, పాలకీడు మండలంలోని బోతలపాలెంలోనిఅందరివారికుంట, వూరకుంట, మూసీఓడ్డుసింగారంలోని చింతకుంట.

మార్చి 2న పెన్‌పహాడ్ మండలంలోని కన్నపకుంట, సంఘాలకుంట, చిలవచెరువు, ఊరకుంట, వేడిలికుంట, యాటలకుంట, చిన్నగారెకుంట, మట్టమకుంట, మోదుగులకుంట, తేట్టికుంట, పిచ్చికుంట, వర్లకుంట, సూర్యాపేట మండలంలోని చింతలవానికుంట, బాసవాయిచెరువు, దాసాయి చెరువు, గుడికుంట, పెద్దచెరువు, జోతికుంట, సపావత్‌కుంట, ఊర చెరువు.

మార్చి 3న తిరుమలగిరి మండలం బండ్లపల్లిలోని పీర్లకుంట, బురమియాకుంట, జలాల్‌పూర్‌లోని గల్లిరెడ్డికుంట, జూలుబందంకుంట, ముత్యాలమ్మకుంట, ఊర చెరువులకు వేలం పాటలు నిర్వహించనున్నారు.

## హైకోర్టు ఏజీపీలుగా ముగ్గురికి అవకాశం



హరితకిరణ్



సందీప్



శ్రీనివాసరెడ్డి

**హుజూర్‌నగర్, పాలకవీడు, ఫిబ్రవరి 27:** హైకోర్టు ఏజీపీలుగా జిల్లాకు చెందిన ముగ్గురు నియమితులయ్యారు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన లచ్చిమళ్ళ నాగేశ్వరరావు కుమారుడు లచ్చిమళ్ళ సందీప్‌కుమార్, ధారా ప్రకాశ్ కుమార్తె హరితకిరణ్, పాలకవీడు మండలం గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన సోము శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి నియామకం కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైకోర్టులో న్యాయవాదులుగా పనిచేస్తున్న తమకు ఏజీపీలుగా అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు.

## 'విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి'

**సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 27:** రాష్ట్రంలో అత్యధిక పార్లమెంటు స్థానాలు గెలవాలనే లక్ష్యంతో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ యాత్ర లో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సూర్యాపేట జిల్లా కేంద్రానికి మార్చి ఒకటో తేదీన వస్తున్న సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో వాణిజ్యభవన్ సెంటర్‌లో కార్నర్ మీటింగ్ కోసం స్థలం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. యాత్రకు శాంతినగర్ సమీపంలో స్వాగతం తెలిపి, అనంతరం జమ్మిగడ్డ నుంచి బీజేపీ శ్రేణులతో భారీ ర్యాలీగా వాణిజ్య భవన్ కు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మాజీ మునిసిపల్ ఛైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, సలిగంటి వీరేందర్, ఎండీ అబీద్, పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ జిల్లా నూతన కమిటీ

**కోదాడ, ఫిబ్రవరి 27:** పట్టణంలోని లాల్‌బంగ్లాలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొల్లూరి సింహాద్రి, ప్రధాన కార్యదర్శిగా మాలోతు చందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా భరత్, సహాయ కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా ఉదయ్, సభ్యులుగా రహీం, కిరణ్‌కుమార్, గోపి, వేణు, కిరణ్, సుమంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ కార్యదర్శి రవి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

**సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 27:** క్రీడలు మానసికోల్లాసాన్ని కలగజేయడంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని తెలంగాణ ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ సొసైటీ అధ్యక్షుడు రుద్రాక్షి నర్సింహ అన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ట్రైబల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యా ర్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోలి పద్మ, ట్రైబల్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'తేజ' విద్యార్థుల వినూత్న ప్రదర్శన

**కోదాడ రూరల్, ఫిబ్రవరి 27:** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోదాడలోని తేజ టాలెంట్ స్కూల్ విద్యార్థులు మంగళవారం సైన్స్ డే ఆకారంలో కూర్చుని వినూత్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ సైన్స్ ఫలితాలను, ఫలాలను ప్రజలు ఉపయోగించుకోవాలని, మూఢ విశ్వాసాల నుంచి ప్రజలు బయటపడాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సోమప్ప జాతరను విజయవంతం చేయాలి

**నేరేడుచర్ల, ఫిబ్రవరి 27:** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండలంలోని బూర్గులతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సోమప్ప సోమశ్వరాలయం వద్ద నిర్వహించే శివరాత్రి జాతరను విజయవంతం చేయాలని తహసీల్దార్ సైదులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా మార్చి 8న దేవాలయానికి వచ్చే భక్తుల తాగునీటికి, దర్శనానికి ఎటువంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య సమస్య, పార్కింగ్ సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మృత్యుంజయశాస్త్రి, నాయబ్ తహసీల్దార్ మౌనిక, ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

# రూ.2.94కోట్లతో మునిసిపల్ బడ్జెట్ ఆమోదం

**తిరుమలగిరి, ఫిబ్రవరి 27:** తిరుమలగిరి మునిసిపల్ బడ్జెట్ సమావేశం మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో జరిగింది. రూ.2.94కోట్ల బడ్జెట్‌కు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. ఈ సమావే శానికి మొత్తం 15 మంది సభ్యులకు బీఆర్ఎస్ నుంచి ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌పాటు ఇద్దరు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నుంచి నలుగురు కౌన్సిలర్లు, బీజేపీ నుంచి నుంచి ఒక్కరితో కలిపి 9మందితో పాటు, కోఆప్షన్ సభ్యులు నలుగురు హాజరయ్యారు. మునిసిపల్ చట్టం ప్రకారం సభ్యులు హాజరుకావడంతో బడ్జెట్ సమావేశం నిర్వహించి, 2024-25 సంవత్సరానికి రూ.2.94కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ కౌన్సిలర్లు సంతకాలు చేశారని మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి తెలిపారు. ఈ మొత్తంలో జీతభత్యాలకు రూ.కోటి 12లక్షలు, విద్యుత్ చార్జీలకు రూ.6లక్షలు, మిగిలిన డబ్బును మౌలిక సదుపాయాలకు వెచ్చించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

### షరతులతో బడ్జెట్ ఆమోదం

ఉద్యోగ, కార్మికుల వేతనాల దృష్ట్యా షరతులతో కూడిన బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు నరేష్, జితేందర్, భాస్కర్, హన్మంతు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, కమిషనర్‌తో కలిసి కౌన్సిలర్ల తీర్మానాలు లేకుండానే ఇష్టారాజ్యంగా రూ.3కోట్ల ఖర్చుచేశారని ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇష్టానుసారం నియమించుకుని, విధులకు రాకపోయినా లక్షల్లో జీతభత్యాలను చెల్లించారని ఆరోపించారు. దీనికి పూర్తి విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ రజని, కమిషనర్ రామదుర్గారెడ్డి

10 నెలలుగా సాధారణ కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేయకుండా, సభ్యుల ఆమోదం లేకుండా బిల్లులు డ్రాచేశారన్నారు. సభ్యుల ఆమోదం లేకుండా నిదులు ఖర్చుపెట్టవద్దన్న షరతుతో బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు కౌన్సిలర్లు తెలిపారు.


## ఆజాద్ చంద్రశేఖర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

**కోదాడ, తుంగతుర్తి, ఫిబ్రవరి 27:** దేశ ప్రజల విముక్తి కోసం బ్రిటిష్ వారితో విరోచితంగా పోరాడిన ఆజాద్ చంద్రశేఖర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని, ప్రగతిశీల విభజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రవి అన్నారు. ఆజాద్ చంద్రశేఖర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం కోదాడలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీయస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, సింహాద్రి, చందర్‌రావు, నాగరాజు, భరత్, వేణు, ఉదయ్, రహీం, కిరణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

● దేశం కోసం ఆజాద్ చంద్రశేఖర్ ప్రాణ త్యాగం చేశారని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య అన్నారు. తంగతుర్తిలో పీడీఎస్‌యూ-పీవైఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రశేఖర్‌ఆజాద్ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సామాజికవేత్త కోరి నాగయ్య, వినయ్, విశ్వతేజ, కార్తీక్, నవదీప్, నాగేంద్ర, శివాని, మధుప్రియ, సాహితి, రాణి తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి

**నేరేడుచర్ల, ఫిబ్రవరి 27:** సాగర్ నీటిని వెంటనే ప్రభుత్వం విడుదల చేసి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ లకుమళ్ల జ్యోతి జ్యోతి అన్నారు. మంగళవారం నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సాగు, తాగు నీటి కోసం సాగర్ నీటిని విడుదల చేసి రైతులను, ప్రజలను ఆదుకోవాలని పెంచికల్‌దిన్న ఎంపీటీసీ సభ్యుడు ఎల్లబోయిన లింగయ్య సభలో తీర్మానం ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి జడ్పీటీసీ నర్సయ్య, ఎంపీవో విజయకుమారి, అధికారులు పాల్గొన్నారు.




**సూర్యాపేట టౌన్:** మహిళలు అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందినట్లేనని మునిసిపల్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మహిళా చట్టాలపై కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో మెప్మా, ఆర్పీలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

**సూర్యాపేట అర్బన్:** ఏఐటీయూసీ, సీపీఐ నాయకుడు పెండ్ర కృష్ణ మృతి సీపీఐకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో పెండ్ర కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం దాతల సహకారంతో సేకరించిన రూ.40వేలను కృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలోబూర వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

● సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని త్రివేణి పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్‌డేను విజయవంతం చేయాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు.

**సూర్యాపేట సిటీ:** బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడిగా కందుల రమేష్‌ను నియమించారు. సూర్యాపేటలో రమేష్‌కు నియామకపత్రాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అందజేశారు.

**హుజూర్‌నగర్:** గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్‌ల సహకారం ఎంతో అవసరమని తంగెళ్ల గోపరాజు, కట్టా సతీష్ అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామాభివృద్ధికి రూ.15వేలు, అదేవిధంగా ఆ గ్రామ పంచాయతీ సిబ్బంది దుస్తులకు రూ.10వేలను ఎన్ఆర్ఐ యలమంచిలి శ్రీనివాస్‌చౌదరి పంపారు. ఈ చెక్కులను గ్రామ పెద్దలకు, పంచాయతీ సిబ్బందికి శ్రీనివాస్‌చౌదరి కుటుంబ సభ్యులు మంగళవారం అందజేశారు కార్యక్రమంలో వీరాంజనేయులు, ప్రసాద్, నర్సింహాచారి, కట్టా శ్రీను, పాపారావు, నారాయణరెడ్డి, పారుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

●విద్యార్థి నాయకులు జార్జిరెడ్డి, జంపాల స్ఫూర్తితో విద్యారంగాన్ని యువత కాపాడుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు కోరారు. హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన పీడీఎస్‌యూ సమావేశంలో ఆయన మాట్లాడారు.. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.సింహాద్రి, ప్రధాన కార్యదర్శిగా మాలోతు చందర్‌రావు, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పాటు ఇతర కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

● చట్ట సభల్లో బీసీల వాటా సాధించాలని 'విన్నపం ఒక పోరాటం' సంస్థ అధ్యక్షురాలు చీకూరి లీలావతి కోరారు. హుజూర్‌నగర్‌లో ఆమె మాట్లాడుతూ . అణగారిన వర్గాలకు ఆర్.కృష్ణయ్య అండగా ఉన్నారన్నారు.

● హుజూర్‌నగర్‌లోని గాంధీ పార్క్ సెంటరులో బుధవారం ఉదయం 10గంటలకు నిర్వహించే టైలర్స్‌డేను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు షేక్ బాజీవుల్లా, మామిడి శ్రీరాములు, పర్వతపు సతీష్ కోరారు. హుజూర్‌నగర్ పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.

● కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. హుజూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సమావేశంలో సైదులు, అనంతప్రకాశ్, రామ్మూర్తి, రన్‌మియా పాల్గొన్నారు.

**హుజూర్‌నగర్ రూరల్:** ప్రభుత్వం వెంటనే రేషన్‌కార్డులు మంజూరుచేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాపోలు నవీన్ కోరారు. హుజూర్‌నగర్ ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీను, వెంకటేశ్వర్లు, రాము పాల్గొన్నారు.

**మఠంపల్లి:** మండల కేంద్రంలో మండల లోకల్ ఆటో యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మెస్సీ, ప్రధాన కార్యదర్శిగా బి.గురవయ్య, కోశాధికారిగా కె.నాగరాజు, కార్యదర్శిగా వి.నాగులుతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

●ఓజో ఫౌండేషన్ అధినేత పిల్లుట్ల రఘు తండ్రి వీరయ్య(75) అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. వీరయ్య మృతదేహాన్ని మఠంపల్లి మండలంలోని స్వగ్రామం యాతవాకిళ్లకు మంగళవారం తీసుకువచ్చారు. వీరయ్య మృతదేహంపై భూక్య మంజూనాయక్, దుర్గయ్య, శ్రీనివాస్, కాశయ్య, మట్టయ్య తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు.

● కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల యోజన మహిళలకు వరమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు బానోతు రంగానాయక్ అన్నారు. పథకం ద్వారా మంజూరైన ఉచిత గ్యాస్ సిలిండర్లను మఠంపల్లి మండల కేంద్రంలో పంపిణీ చేసి మాట్లాడారు.

● కాంగ్రెస్ పార్టీతోనే తండాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మఠంపల్లి మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ అన్నారు. 'ఉపాధి' పనుల ద్వారా మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో దుర్గయ్య, నాగునాయక్, మాలోతు పున్ననాయక్, భూక్య రవీందర్ పాల్గొన్నారు.

●మఠంపల్లి మండలంలోని మట్టపల్లిలో మంగళవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని పూజారులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**మేళ్లచెర్వు:** శివరాత్రి జాతర సందర్భంగా మేళ్లచెర్వులో ఏర్పాటుచేసే ఫ్లెక్సీలకు, భారీ కటౌట్లకు, హోర్డింగ్‌లకు గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకోవాలని సీఐ రజితారెడ్డి తెలిపారు. ఫ్లెక్సీలలను రోడ్డుకు, విద్యుత్ తీగళ్లకు దూరంగా , ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

**గరిడేపల్లి:** మండల కేంద్రంలోని తుంబాయిగడ్డ మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల పాత్రలను విద్యార్థులు పోషించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్.మానస, బి.స్వర్ణలత, ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు.

**కోదాడ:** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోడి శ్రీరాములు ఆశయాలను సాధించాలని అరుణోదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరాములు చిత్రపటానికి మంగళవారం పట్టణంలోని లాల్ బంగ్లాలో పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పోటు లక్ష్మయ్య పాల్గొన్నారు.

**కోదాడ రూరల్:** ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో బాలికలు ఆధార్ కార్డు చూపి పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ పాస్ కలిగిన బాలురు పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. వివరాలకు హెల్ప్‌డెస్క్ 9959226302, మేనేజర్ సెల్ నెం.7382833558 సంప్రదించవచ్చన్నారు.

● హైదరాబాద్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిని కోదాడ సింగిల్ విండో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుడిబండ గ్రామానికి చెందిన ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

● కోదాడ మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చింతా శ్రీనివాస్‌రెడ్డి (60)మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

**కోదాడ:** పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామివారికి అర్చకులు కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అంజయ్య, తిరుపతయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

**చిలుకూరు:** 'దేశ పాలకుల విధానాలపై నేటి యువత కర్తవ్యం' అనే అంశంపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఈ నెల 28వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనంతుల రాము, కడారు మధు కోరారు. చిలుకూరులోని సీపీఐ భవన్‌లో రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మాధవరపు రమేష్, రఫీ, సాయికుమార్, బాబా తదితరులు పాల్గొన్నారు.

**నూతనకల్:** తుంగతుర్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన మండల కేంద్రానికి చెందిన తీగల గిరిధర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దరిపల్లి వీరన్న, పసుల అశోక్‌యాదవ్, ఇరుగు కిరణ్, జల్లం శ్రీనాథ్, రఘు పాల్గొన్నారు.

●నూతన్‌కల్ మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరు చేసిన ఎమ్మెల్యే మందుల సామేలుకు ఎమ్మార్పీఎస్ ఎర్రపహాడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు మూరగుండ్ల జనార్దన్ కృతజ్ఞతలు తెలిపారు మంగళవారం ఎర్రపహాడ్ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రమేష్, జయరాం, సోమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నూతన్‌కల్ మండలంలోని వెంకేపల్లి గ్రామానికి సీపీఎం నాయకుడు దూదిగాని లింగయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి కందాళ శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన లింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. నివాళులర్పించినవారిలో దూదిగాని ఎల్లయ్య, జనార్దన్, ఉప్పలయ్య ఉన్నారు.

**తిరుమలగిరి రూరల్:** ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల బంగారి అన్నారు. మంగళవారం మండలంలోని మామిడాల గ్రామంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొల్లు మల్లయ్య, శ్రీనివాస్, ఆకుల వీరయ్య, వెంకటయ్య, సోమయ్య పాల్గొన్నారు.

## కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

**తుంగతుర్తి, ఫిబ్రవరి 27:** కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తుంగతుర్తి మండలంలోని కాశితండాలో మంగళవారం జరిగింది. కాశీతండాకు చెందిన షేక్ సలీం కుమార్తె మఫిజ పాఠశాల నుంచి వచ్చి ఆరుబయట ఆడుకుంటుండగా ఆకస్మాత్తుగా కుక్క చిన్నారిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన మఫిజను కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

## పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

**కోదాడ రూరల్, ఫిబ్రవరి 27:** గంజాయి విక్రయిస్తున్న నలుగురిని మండలంలోని దోరకుంట గ్రామంలో పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.. ఆంధ్రాలోని జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి కోదాడ పట్టణంతో పాటు చుట్టుపక్క గ్రామాల్లో విక్రయిసున్నారనే సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

## మంత్రి ఉత్తమ్ ఫ్లెక్సీని చింపిన వారిపై కేసు

**గరిడేపల్లి, ఫిబ్రవరి 27:** భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫ్లెక్సీని చింపినవారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఇబ్రహిం తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో ఈ నెల 18 నుంచి 23 వరకు జరిగిన అరవింద ధ్యాన మందిర 52వ వార్షికోత్సవంలో భాగంగా ఉత్తమ్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిని కొందరు చింపారని గ్రామానికి చెందిన బత్తిని ఉషాకిరణ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన బచ్చు రోశయ్యతో పాటు మరికొందరి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**తుంగతుర్తి, నేరేడుచర్ల, తిరుమలగిరి ఫిబ్రవరి 27:** నేటి నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. తుంగతుర్తిలో రెండు పరీక్షా కేంద్రాలు (ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాల) ఏర్పాటు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు కె.ప్రభాకర్‌రెడ్డి, పి.నీలారాణి మంగళవారం తెలిపారు. నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ మాధవి తెలిపారు. తిరుమలగిరిలో రెండు పరీక్షా కేంద్రాలు (అనంతారం మోడల్ స్కూల్, తిరుమల కాలేజీ) ఏర్పాటు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వేముల బాలరాజు తెలిపారు.

## అంగరంగ వైభవంగా చీదెళ్ల జాతర

**పెన్‌పహాడ్, ఫిబ్రవరి 27:** మండలంలోని చీదెళ్ల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్యస్వాముల జాతర మంగళవారంతో నాలుగో రోజుకు చేరింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు జాతరకు హాజరై మొక్కులు చెల్లించారు. చెట్లముకుందాపురం గ్రామంలో శ్రీ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

## దేవతామూర్తుల ఊరేగింపు

**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 27:** పట్టణంలోని ఫణిగిరి గట్టు నుంచి శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణమూర్తులను ఊరేగింపుగా హుజూర్‌నగర్‌లోని రామాలయానికి మంగళవారం తీసుకువచ్చారు. కార్యక్రమంలోఈవో గుజ్జుల కొండారెడ్డి, నరగిరినాథుని నర్సింహాచార్యులు, వేదాంతం మోహనాచార్యులు, భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి మార్కెట్ ఛైర్మన్‌గా గిరిధర్‌రెడ్డి



**నూతనకల్, ఫిబ్రవరి 27:** తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన తీగల గిరిధర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిధర్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ప్రధాన అనుచరుడు అయిన మల్లారెడ్డి బీఆర్ఎస్‌లో తగిన ప్రాధాన్యం లేకపోవడంతో 2018 ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో నూతన్‌కల్ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయన కోడలు కరుణశ్రీకి అవకాశం రావడంతో గెలుపొందారు. గిరిధర్‌రెడ్డికి ఛైర్మన్ పదవి రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలి

**హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 27 :** సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలు కాపాడాలని సీపీఎం రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

**సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 27:** సూర్యాపేట మునిసిపాలిటీలో తాగు నీటి సమస్యను అధికారులు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్)ప్రజా పంథా జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.